ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
అనంతపురం
జిల్లా వార్తలు
సోమవారం 15 సెప్టెంబరు 2025
ఉష్ణోగ్రత ఆదివారం గరిష్ఠం : 33.0 కనిష్ఠం : 25.0



నేడే డీఎస్సీ ఎంపిక జాబితా

19న అమరావతిలో నియామక పత్రాలు

అక్కడికి ప్రత్యేక బస్సుల్లో తరలింపు

కోర్టు కేసులతో టెన్షన్

7

శభాష్.. మోనాలిసా..

● జాతీయ సదస్సుకు వజ్రకరూరు సర్పంచ్



మోనాలిసా

ఉరవకొండ, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): ఇటీవలే జాతీయ స్థాయిలో అవార్డు అందుకోవడం ద్వారా అందరి మన్ననలు పొందిన వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా మరో అరుదైన అవకాశం దక్కించుకుంది. జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించనున్న క్వాలిటీ కాంక్లేవ్ ఆఫ్ ఇండియా సదస్సులో పాల్గొనే అవకాశం దక్కించుకుంది. సోమవారం నుంచి జరగనున్న సదస్సులో ఆమె పాల్గొననున్నారు. దేశం మొత్తం 75 మంది సర్పంచ్‌లు సదస్సుకు ఎంపికవగా.. అందులో మోనాలిసా ఉండడం విశేషం.

అదృశ్యంపై అలసత్వం..!

చిన్నపాటి విషయాలకే గొడవలు

ఇళ్ల నుంచి వెళ్లిపోతున్న వైనం

జిల్లా కేంద్రంలో భారీగా మిస్సింగ్ కేసులు



ఈ చిత్రంలో ఉన్న మహిళ పేరు నాగలక్ష్మి(29). తన ముగ్గురు పిల్లలు ఆశిష్(6), అనన్య(9), మహీధర్(12)తో కలసి పది రోజుల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది. దంపతుల మధ్య చిన్నపాటి తగవుతో ఇంటి నుంచి వెళ్లిపోయింది. నాలుగో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇంత వరకూ ఆమె ఆచూకీ తెలియలేదు. పోలీసులు సైతం పెద్దగా పట్టించుకోవడం లేదు. ఇలాంటి కేసులు జిల్లాలో చాలానే ఉన్నాయి.

నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్



అనంతపురం క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో మిస్సింగ్ కేసులు పెరిగిపోతున్నాయి. బాలికలు, యువతులు, మరీ ముఖ్యంగా మధ్య వయస్కులైన మహిళలు, పురుషులు ఈ జాబితాలో ఉన్నారు. ప్రేమ పేరుతో కొందరు బాలికలు, యువతులు, దంపతుల మధ్య మనస్పర్థలతో మరికొందరు ఇళ్ల నుంచి ఉన్నఫలంగా వెళ్లిపోతున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రతి స్టేషన్ పరిధిలో ప్రతి నెలా 10 నుంచి 15 వరకూ ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసులు మూడు, నాలుగు కేసులు నమోదు చేసి చేతులు దులుపుకుంటున్నారు. మిస్సింగ్ అయిన వారి ఆచూకీ కనిపెట్టడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

జిల్లా కేంద్రంలోనే ఎక్కువ..

అనంతపురం జిల్లా కేంద్రంలో మిస్సింగ్‌లు పెరుగుతున్నాయి. బాలికలు, యువతులు కనిపించలేదంటూ తల్లిదండ్రులు.. భార్య కనిపించలేదంటూ భర్త, భర్త కనిపించలేదంటూ భార్య. ఇలా పోలీస్టేషన్లలో ఫిర్యాదులు భారీగా పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో ప్రతి నెలా ప్రతిస్టేషన్ పరిధిలో 10 నుంచి 15 వరకూ ఈ ఫిర్యాదులు వస్తున్నాయి. పోలీసులు పెద్దగా కేసులు నమోదు చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కేసు నమోదు చేస్తే.. పెండింగ్ లిస్టు పెరుగుతుందన్న భయం ఒకటైతే... ఈ కేసుల వల్ల పెద్దగా కాసులు రావన్న కారణంగా కేసుల నమోదుకు ఆసక్తి చూపలేదన్న విమర్శలు ఉన్నాయి.

కేసుల నమోదులో నిర్లక్ష్యం

మిస్సింగ్ కేసుల నమోదు, ఛేదింపులో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. చాలా స్టేషన్లలో మిస్సింగ్ ఫిర్యాదులపై కేసులు పెద్దగా నమోదు చేయడంలేదు. కేసులు నమోదు చేసినా ఛేదింపులో ఆసక్తి చూపడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. దీనికితోడు దంపతుల గొడవల కేసులు, బాలికలు, యువతుల మిస్సింగ్ కేసుల్లో వాళ్ల బంధువుల నుంచి వాస్తవాలు చెప్పడం లేదని తెలుస్తోంది. వారు ఎందుకు వెళ్లిపోయారు..? ఏదైనా గొడవ జరిగిందా..? తిట్టడం వల్ల వెళ్లారా..? వంటి విషయాలను ఫిర్యాదిదారులు పోలీసుల వద్ద దాచేస్తుండటం కొంత ఇబ్బందిగా మారుతోంది. దీనికితోడు మిస్సింగ్ కేసుల ఛేదింపులో పెద్దగా లాభం కూడా ఉండకపోవడంతో పోలీసులు ఆసక్తిత చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.



బలహీనపడుతున్న బంధాలు

తల్లిదండ్రులు, పిల్లలు.. దంపతులు, ఇతర కుటుంబ సభ్యుల మధ్య బంధాలు బలహీనపడుతున్నాయి. తల్లిదండ్రులు మందలించారనో, సెల్‌ఫోన్ కొనివ్వలేదనో, అడిగింది ఇవ్వలేదనో అలిగి వెళ్లే పిల్లలూ ఉన్నారు. భర్త కోప్పడ్డాడని భార్య, భార్య పట్టించుకోలేదని భర్త, పిల్లలు సరిగ్గా యోగక్షేమాలు చూడటం లేదని తల్లిదండ్రులు ఇలా చిన్నపాటి మనస్పర్థలకు ఇంట్లో నుంచి అలిగి వెళ్లిపోతున్నారు. ముఖ్యంగా బాలికలు, యువతులు ప్రేమ పేరుతో తల్లిదండ్రులకు చెప్పకుండా వెళ్లిపోవడం ఎక్కువ కనిపిస్తోంది. కుటుంబ సభ్యుల మధ్య బంధాలు బలహీనపడుతున్నాయి. ఫలితంగా చిన్న మాట అన్నా ఇంటి నుంచి వెళ్లిపోయే స్థితికి చేరుకున్నారు.

ఆ ముగ్గురిదే రాజ్యం..

జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయం



● ఏడీసీసీ బ్యాంకులో వైసీపీ మద్దతుదారుల హవా

● చైర్మన్‌ను పక్కదోవ పట్టిస్తున్న వైనం

● సీఈఓ నియామకానికి అడ్డంకులు

అనంతపురం క్లాక్‌టవర్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (ఏడీసీసీబీ)లో ముగ్గురు అధికారులు ఆడిందే ఆటగా సాగుతోంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో పెత్తనం చలాయించిన అధికారులే కూటమిలోనూ హల్‌చల్ చేస్తున్నారు. పర్సన్ ఇన్‌చార్జిని తప్పిస్తూ.. ఏక సభ్యకమిటీ (మిగతా 7లో..)

కర్ణాటకకు కలప..

అక్రమంగా తరలింపు



లారీలో కర్ణాటకకు తరలిపోతున్న కలప

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా నుంచి కలప కర్ణాటకకు అక్రమంగా తరలిపోతోంది. అనుమతులు లేకుండా వృక్షాలను నేలమట్టం చేస్తూ.. అక్రమ మార్గంలో కలపను తరలిస్తున్నారు. అంతా పబ్లిక్‌గానే సాగుతున్నా.. సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం. మండలంలోని వివిధ గ్రామాల నుంచి నిత్యం పదుల సంఖ్యలో వాహనాల్లో కలపను అక్రమార్కులు కర్ణాటకకు తరలిస్తున్నారు. చెట్టును నరకాలంటే అనుమతులు పొందాల్సి ఉంటుంది. అవేవీ తీసుకోకుండానే అక్రమార్కులు భారీ వృక్షాలను నరికేస్తున్నారు. అటవీ శాఖలోని కొందరు అధికారులు ఆమ్యామ్యాలు పుచ్చుకుంటూ అక్రమార్కులకు సహకరిస్తున్నారన్న విమర్శలున్నాయి. దీంతో అక్రమార్కులు నిత్యం వందలాది చెట్లను నరికేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. కళ్యాణదుర్గం వైపు నుంచి రోజూ లారీల్లో కలపను బొమ్మనహాళ్ మీదుగా కర్ణాటక ప్రాంతానికి తరలిస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేడు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి కలప అక్రమ రవాణాను కట్టడి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు పరిష్కార వేదిక

అనంతపురం కలెక్టరేట్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు డీఆర్వో మలోల ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం ఉంటుందన్నారు. జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ● ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర మహాసభలు

(వివరాలు 7వ పేజీలో...)

క్రైం కార్నర్

రాణినగర్‌లో వ్యక్తి హత్య

● వివాహేతర సంబంధమే కారణమా?

అనంతపురం క్రైం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాణినగర్‌లో దారుణ హత్య చోటు చేసుకుంది. బుక్కరాయసముద్రం మండలం పొడరాళ్లకు చెందిన చిన్న పెద్దన్న(50) హత్యకు గురైనట్లు అనంతపురం వన్‌టౌన్ పోలీసులు గుర్తించారు. మృతుడి కొడుకు ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిన్న పెద్దన్న కోళ్ల తరలించే వాహనానికి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. నగరంలోని రాణినగర్‌లో ఉంటున్న అంజినమ్మతో అతడికి వివాహేతర సంబంధం ఉన్నట్లు సమాచారం. ఆమెతో ఐదురోజుల కిందట గొడవ పడినట్టు తెలుస్తోంది. శనివారం సాయంత్రం పొడరాళ్లలోని ఇంటి నుంచి వెళ్లిన అతడు.. ఆదివారం ఉదయం హత్యకు గురయ్యాడు. ఇంట్లో అతడిని కొట్టి చంపినట్లు తెలుస్తోంది. అంజినమ్మ, ఆమె కొడుకు రమేష్, మరికొందరు ఈ హత్య చేశారంటూ మృతుడి కొడుకు గోపాల్.. వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

గుత్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే క్వార్టర్స్‌లో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి హరి భార్య శిరీష(32) అనే మహిళ ఆదివారం ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. హరి రైల్వే డీజిల్ షెడ్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆదివారం ఉదయం అతడు డ్యూటీకి వెళ్లాడు. అనంతరం ఆమె ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే స్థానికులు గమనించి భర్తకు సమాచారం అందించారు. ఆమెను చికిత్స నిమిత్తం రైల్వే ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. మృతురాలికి ఇద్దరు సంతానం ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం దుకాణంలో చోరీ

బుక్కరాయసముద్రం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గాంధీనగర్ వద్ద ఎస్ఎల్‌వీ మద్యం దుకాణంలో ఆదివారం వేకువ జామున దుండగులు చోరీకి పాల్పడ్డారు. పోలీసులు తెలిపిన మేరకు.. బుక్కరాయసముద్రంలోని గాంధీనగర్ వద్ద ఉన్న మద్యం దుకాణంలోకి ఇద్దరు దుండగులు ప్రవేశించి దుకాణంలో ఉన్న రూ. రూ.11వేల నగదు ఎత్తుకెళ్లినట్లు మద్యం షాపు యాజమానులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి పాల్పడిన దృశ్యాలు సీసీ కెమెరాలలో నమోదయ్యాయి. సీసీ ఫుటేజ్‌ను స్వాధీనం చేసుకుని దొంగల ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మహిళ హత్య కేసులో నిందితుల అరెస్టు

ధర్మవరం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసి వంకలో పూడ్చేసిన కేసులో భర్తతోపాటు మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన వివరాలు వెల్లడించారు. సీకేపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరంలోని ఇందిరమ్మకాలనీలో భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. సరస్వతి వివాహేతర సంబంధం పెట్టుకుందనీ, ప్రవర్తన మార్చుకోవాలని సూచించాడు. ఎంత చెప్పినా ఆమె వినలేదు. దీంతో వెంకటరాముడు తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామాంజి, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజినమ్మ సహాయంతో సరస్వతిని చంపేసి నరసింహులు, విజయ్ సహాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చివేశాడు. సరస్వతి మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని, పోలీసులు దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో సరస్వతిని భర్త వెంకటరాముడు చంపినట్లు నిర్ధారణ అయింది. దీంతో వెంకటరాముడు, నరసింహులు, విజయ్‌ను ఆదివారం మేడాపురం క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. అనంతరం నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.

గుంతకల్లు-రాయచూరు సెక్షన్ తనిఖీ

గుంతకల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్‌లోని గుంతకల్లు-రాయచూరు సెక్షన్‌ను డీఆర్ఎం చంద్రశేఖర్ గుప్తా ఆదివారం తనిఖీ చేశారు. ఆయన ప్రత్యేక రైలులో గుంతకల్లు, ఆదోని, మంత్రాలయం రోడ్డు, రాయచూరు, యాద్గిర్ స్టేషన్లను సందర్శించారు. అమృత్ స్టేషన్ పథకం కింద చేపట్టిన నిర్మాణ పనులను పరిశీలించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత లోపించరాదని, అత్యుత్తమ ప్రమాణాలతో ప్రయాణికులకు సౌకర్యాల మెరుగుపై దృష్టి సారించాలని అధికారులు, కాంట్రాక్టర్లకు తెలియజేశారు. అనంతరం రైల్వే స్టేషన్లలో ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ పనితీరును పరిశీలించారు. ఇంటర్లాకింగ్, భద్రతా ప్రొటోకాల్స్ విషయంలో స్టేషన్ ఆపరేటింగ్ సిబ్బంది ప్రత్యేక దృష్టిని నిలపాలని ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ రైల్వే శాఖల ఇన్‌చార్జులు, ఇంజనీర్లు పాల్గొన్నారు.

25 నుంచి రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నీ

గుత్తి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): గుత్తిఆర్ఎస్‌లోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ క్రీడా మైదానంలో గౌతమిపురి ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 25 నుంచి 27 వరకు రాష్ట్ర స్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్డీటీ, రైల్వే ఇన్‌స్టిట్యూట్ సంయుక్తంగా ఈ టోర్నమెంట్ నిర్వహిస్తున్నాయన్నారు. విన్నర్‌కు రూ.50వేలు, రన్నరప్‌కు రూ.25వేలు అందజేస్తామన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 18లోపు పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9052653405, 9985678208, 9966560163 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బాలురలో తూర్పు.. బాలికల్లో గుంటూరు..


● బాల్ బ్యాడ్మింటన్ రాష్ట్రస్థాయి విజేతలుగా ఆవిర్భావం




బాలుర విజేత తూర్పుగోదావరి జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న మధుసూదన్ రెడ్డి

బత్తలపల్లి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి జూనియర్ బాలబాలికల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో తూర్పుగోదావరి, గుంటూరు జట్లు చాంపియన్లుగా అవతరించాయి. మండలంలోని రామాపురం గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న అంతర్ జిల్లా బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ఆదివారం ముగిశాయి. బాలుర విభాగ ఫైనల్లో చిత్తూరుపై తూర్పుగోదావరి జిల్లా జట్టు గెలుపొంది, విజేతగా అవతరించింది. బాలికల విభాగంలో విశాఖపట్నంపై గుంటూరు జట్టు గెలుపొంది, ట్రోఫీని కైవసం చేసుకుంది. విజేత జట్లకు జనసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్ రెడ్డి ట్రోఫీలను అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. క్రీడలతో క్రమశిక్షణ, పట్టుదల, ఆరోగ్యం పెంపొందుతాయన్నారు.

కార్యవర్గం ఎన్నిక



తిమ్మప్ప, అధ్యక్షుడు



సుబ్రహ్మణ్యం, ప్రధాన కార్యదర్శి

అనంతపురంరూరల్, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని యూనివర్సిటీల బోధనేతర ఉద్యోగుల కార్యవర్గాన్ని ఆదివారం శ్రీకృష్ణదేవరాయ యూనివర్సిటీలో ఎన్నుకున్నారు. సంఘం రాష్ట్ర సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. కార్యవర్గ ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షుడిగా శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో పనిచేస్తున్న తిమ్మప్ప, ప్రధాన కార్యదర్శిగా శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీకి చెందిన సుబ్రహ్మణ్యం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదే యూనివర్సిటీకి చెందిన మనోకుమార్ సింగ్‌ను మీడియా కో ఆర్డినేటర్‌గా ఎన్నుకున్నారు. మరో 30 మందిని సభ్యులుగా ఎన్నుకున్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమన్వయంతో కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు తెలిపారు.

నేడే డీఎస్సీ ఎంపిక జాబితా

● 19న అమరావతిలో నియామక పత్రాలు
● అక్కడికి ప్రత్యేక బస్సుల్లో తరలింపు
● కోర్టు కేసులతో టెన్షన్



డీఎస్సీలో ఎంపికైన అభ్యర్థులు (ఫైల్)

అనంతపురం విద్య, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ ముగింపు దశకు చేరింది. ఎంపికైన అభ్యర్థుల జాబితాను సోమవారం అధికారికంగా ప్రకటించనున్నారు. ఈ మేరకు ఇప్పటికే రాష్ట్రశాఖ నుంచి 773 మంది అభ్యర్థులతో జిల్లా విద్యాశాఖకు ఎంపిక జాబితా రాగా.. ఇక్కడి జిల్లా సెలెక్షన్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టర్ పరిశీలనకు పంపించారు. కొత్త ఎంపిక జాబితాకు ఆమోదం వేసినట్లు సమాచారం. సోమవారం జిల్లాలవారీగా తుది జాబితాలను ప్రకటిస్తారు. డీఎస్సీ వెబ్‌సైట్‌లో కూడా పెట్టనున్నారు. ఏడేళ్ల తర్వాత నిర్వహించిన డీఎస్సీ ఇదే. నారా చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం రోజున దీనిపైనే తొలిసంతకం చేశారు. టీచర్ల నియామకాల పట్ల నిరుద్యోగ అభ్యర్థులల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఈ నియామకాల ప్రక్రియను పండుగలా నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అందులో భాగంగానే ఈనెల 19న అమరావతిలో ఒకేచోట రాష్ట్రవ్యాప్తంగా టీచర్ల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులను ఆహ్వానించి సీఎం చంద్రబాబునాయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ చేతుల మీదుగా నియామక పత్రాలు అందజేయాలని ఆ శాఖ ఉన్నతాధికారులు ముహూర్తం ఖరారు చేశారు. ఈ మేరకు రాష్ట్రశాఖ నుంచి మౌఖికంగా ఆదేశాలు వచ్చాయి. జిల్లాలో ఎంపికైన అభ్యర్థులను ఈనెల 17వతేదీరాత్రి ప్రత్యేక బస్సుల్లో తీసుకెళ్లేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. 18న అక్కడ కేటాయించిన ప్రదేశంలో వీరందరు రిజిస్టర్ చేయించుకోవాల్సి ఉంటుంది. 19న నియామకపత్రాలు అందజేస్తారు. ఇక్కడికి వచ్చిన తర్వాత కౌన్సెలింగ్ నిర్వహించి ప్లేస్‌మెంట్(పాఠశాల) కేటాయిస్తారు. ఒక అభ్యర్థి వారివెంట ఒక కుటుంబ సభ్యుడికి అమరావతికి వెళ్లడానికి అవకాశం ఇవ్వడంతో అనంత జిల్లాకు 37 బస్సులు అవసరమవుతాయని విద్యాశాఖ అంచనా వేస్తోంది.

● కోర్టు కేసులతో టెన్షన్

డీఎస్సీ నియామకాల ప్రక్రియ ముగింపునకు చేరుకోగా.. కొందరు అభ్యర్థులు వివిధ సమస్యలతో కోర్టులకు వెళ్లారు. ప్రధానంగా కొందరు అభ్యర్థులు రెండు,మూడు సబ్జెక్టులకు ఎంపికయ్యారు. దరఖాస్తు సమయంలోనే ఏ పోస్టుకు ప్రాధాన్యం ఇస్తారో నమోదు చేయించుకున్నారు. కొందరు తొలుత ఎస్జీటీ, తర్వాత స్కూల్‌అసిస్టెంట్, ఇతర పోస్టులకు ప్రాధాన్యం ఇచ్చారు. ఆ మేరకు ర్యాంకుల వారీగా ఆయా అభ్యర్థులకు పోస్టులు కేటాయించారు. దీంతో స్కూల్ అసిస్టెంట్‌కు ఎంపికైన అభ్యర్థులు తమకు ఎస్జీటీ కేటాయించడం అన్యాయమని, స్కూల్‌అసిస్టెంట్‌కు అవకాశం ఇవ్వాలని కోర్టును ఆశ్రయించారు. దీనిపై అభ్యర్థుల వైపే న్యాయస్థానం మొగ్గు చూపుతూ ఉత్తర్వులు ఇచ్చింది. మరోవైపు పీఈటీలు, పీడీల పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు ప్రైవేట్ కాలేజ్‌లలో చేరి అక్కడ క్లాస్‌లకు వెళ్లకుండా రెగ్యులర్‌గా కోర్సు పూర్తి చేసుకున్నట్లు సర్టిఫికెట్లు పొంది ఉద్యోగాలకు ఎంపికయ్యారని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ జరిపి న్యాయం చేయాలని కోర్టుకు వెళ్లారు. ఈ నేపథ్యంలో డీఎస్సీ ఎంపిక జాబితా విడుదలపై సందిగ్ధత కొనసాగుతోంది.

తిరుపతిలో సందడి





తిరుపతి సదస్సులో పాల్గొన్న మంత్రి సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, బండారు శావణిశ్రీ, పల్లె సింధూరారెడ్డి

అనంతపురం క్రైం/శింగనమల, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు సందడి చేశారు. ఓ ప్రైవేటు కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం నిర్వహించిన జాతీయ మహిళా సాధికార సదస్సులో రాష్ట్ర బీసీ సంక్షేమ, చేనేత జౌళి శాఖ మంత్రి సవిత, రాప్తాడు, పుట్టపర్తి, శింగనమల ఎమ్మెల్యేలు పరిటాల సునీత, పల్లె సింధూరారెడ్డి, బండారు శ్రావణి శ్రీ పాల్గొన్నారు. తమ అభిప్రాయాలను వెల్లడించారు. అనంతరం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు.

సమస్యల పరిష్కారానికి పోరాటాలు

● కార్మికులను నిర్లక్ష్యం చేస్తే ప్రతిఘటన
● సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు
● ముగిసిన మధ్యాహ్న భోజన పథకం కార్మికుల రాష్ట్ర మహాసభలు



రాష్ట్ర అధ్యక్షురాలు వరలక్ష్మి



ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి



కోశాధికారి మద్దూరు నాగమణి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారమే అజెండాగా పోరాటాలు సాగించాల్సిన అవసరం ఉందని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పేర్కొన్నారు. కార్మికులను నిర్లక్ష్యం చేసే ప్రభుత్వాలపై ప్రతిఘటన తప్పదని స్పష్టం చేశారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని గణేనాయక్ భవన్‌లో శనివారం నుంచి నిర్వహిస్తున్న యూనియన్ 5వ రాష్ట్ర మహాసభలు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఓబులు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప విధానాలు మారడం లేదన్నారు. అదానీ, అంబానీ ఆస్తులు పెంచడానికి కార్పొరేట్ విధానం తీసుకొచ్చి విద్య, వైద్య రంగాల సేవలను ప్రజలకు దూరం చేస్తున్నారని మండిపడ్డారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు నెలకు రూ.3వేలు మాత్రమే చెల్లించడం సరికాదన్నారు. మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ జాతీయ ప్రధాన కార్యదర్శి మాలిని మాట్లాడుతూ... మధ్యాహ్న భోజన పథకానికి బడ్జెట్ కోతలు విధిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. కార్మికులు 3 గంటలు మాత్రమే పనిచేస్తున్నారంటూ ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. కార్మికులకు రూ.15వేలు కనీస వేతనం ఇవ్వాలని, బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. డిమాండ్ల సాధనకోసం డిసెంబరులో కేంద్ర మంత్రుల నివాసాల వద్ద దీక్షలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టేట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లపల్లి విజయభాస్కర్, యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు రమణయ్య, నాయకులు క్రిష్ణమూర్తి, దయా రమాదేవి, నాగమణి పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక

మహాసభల్లో భాగంగా మధ్యాహ్న భోజన పథకం యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలిగా వరలక్ష్మి, ప్రధాన కార్యదర్శిగా దయా రమాదేవి, కోశాధికారిగా మద్దూరు నాగమణి, ఆఫీస్ బేరర్స్‌గా మహాలక్ష్మి, సుధారాణి, శాంత, మంగశ్రీ, వరలక్ష్మి, నాగవరలక్ష్మి, నాగమణి, సుప్రజ, సమ్మక్క, శివకుమారి, కల్పన, ఎస్‌కే రెహాన్, విజయమ్మలతో పాటు మరో 41 మందితో కూడిన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు

ఆ ముగ్గురిదే రాజ్యం..!

(5వ పేజీ తరువాయి)

చైర్మన్‌ను నియమించినా వాళ్లదే జరుగుతోంది. వైసీపీ కోవర్టులుగా ముద్ర వేసుకున్న అధికారులు చైర్మన్‌ను సైతం పక్కదోవ పట్టిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. సంస్థను గాడిలో పెట్టాలని చైర్మన్ చేస్తున్న ప్రయత్నాలను సైతం ప్రభావితం చేసే విధంగా ఆ ముగ్గురు అధికారుల వ్యవహారతీరు కనబడుతోంది. ఏడీసీసీ బ్యాంకులో ఆ ముగ్గురు అధికారుల తీరుతో సంస్థకు తీవ్ర నష్టం కలిగే ప్రమాదం ఉందనే చర్చ జరుగుతోంది. నూతన చైర్మన్ బాధ్యతలు తీసుకున్నప్పటి నుంచి ఆ ముగ్గురు ఆయనను ప్రసన్నం చేసుకోవడానికి చేస్తున్న తిప్పలు అన్నీఇన్నీ కావు. ఉదయం లేచినప్పటి నుంచి చైర్మన్ చుట్టూ తిరగడమే పనిగా పెట్టుకున్నారు. పలు నిర్ణయాల్లో చైర్మన్‌ను పక్కదోవ పట్టించే విధంగా వారి వ్యవహారశైలి కనిపిస్తోంది. గతంలో బ్యాంకు సీఈఓలుగా పనిచేసిన ఆ ముగ్గురు అధికారులు తీరుపై సిబ్బందిలోనూ అసహనం కనిపిస్తోంది. బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఒకే చోట అధికారులంతా పనిచేయాలనే నిబంధన ఉంది. వీరిలో ఓ అధికారి రెండో అంతస్తులో, మరొకరి మొదటి అంతస్తులో, ఇంకొకరు గ్రౌండ్‌ఫ్లోర్‌లో పనిచేస్తున్నారు. ఆ ముగ్గురిలో ఒకరిపై కళ్యాణదుర్గం బ్రాంచ్‌లో జరిగిన అవినీతి అక్రమాల్లో కీలకంగా ఉన్న మేనేజర్‌ను కాపాడడం, మరో అధికారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు, మరో అధికారిపై ఆత్మకూరు బ్రాంచ్‌లో నకిలీ పట్టాలకు రుణాలు చెల్లించిన కేసుల్లో ప్రధానంగా ఉన్నారు.


వైసీపీ హయాంలో బ్యాంకుకు తీవ్ర నష్టం

వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల కాలంలో సహకార బ్యాంకులను, సహకార సొసైటీలను నిర్వీర్యం చేసింది. అధికారులు, ఉద్యోగులు ఒకే స్థానంలో అంటిపెట్టుకుపోవడంతో తమకు కేటాయించిన విధులు, లక్ష్యాలకు తూట్లు పొడిచారు. ఐదేళ్లలో సొసైటీలకు ఎన్నికలు నిర్వహించకపోగా...నామినేటెడ్ పద్ధతిన పర్సన్ ఇన్‌చార్జిలను నియమించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకులలో అనంతపురం బ్యాంకు చివరి స్థానంలో నిలిచింది. ప్రథమ స్థానంలో ఉన్న కృష్ణా జిల్లా రూ.10వేల కోట్ల టర్నోవర్‌లో ఉండగా....అనంతపురం కేవలం రూ.1800 కోట్లు మాత్రమే టర్నోవర్ చేస్తోంది. తమ ఆధిపత్యం కోసం ఏడీసీసీ బ్యాంకులో ఉద్యోగులను వర్గాలుగా విభజించారు.

సీఈఓ నియామకానికి అడ్డంకులు

ఏడీసీసీ బ్యాంకుకు కొత్త సీఈఓ నియామకంపై ఆ ముగ్గురు అడ్డుపడుతున్నారనే విమర్శలు ఉన్నాయి. ఏడీసీసీ బ్యాంకుకు కొత్త సీఈఓ నియామకానికి రాష్ట్ర ప్రభుత్వం-ఆప్కాబ్ గతేడాది నవంబరులో ఇంటర్వ్యూలు నిర్వహించాయి. ఇంటర్వ్యూలను రద్దు చేసి ఈ ఏడాది జూన్ 29న మరోసారి ఆప్కాబ్ అధికారులు అనంతపురం నుంచి ఇంటర్వ్యూకు ప్రస్తుతం సీఈఓగా ఉన్న అధికారిణితో పాటు మరో ఇద్దరు అధికారులు హాజరయ్యారు. హాజరైన వారిలో ముగ్గురూ సీఈఓలుగా పనిచేశారు. ఒక అధికారి వచ్చే ఏడాది జూన్‌లో రిటైర్ కానునండడంతో తిరస్కరించారు. మరో అధికారిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు ఉండడంతో ఆప్కాబ్ అధికారులు తిరస్కరించారు. ప్రస్తుతం ఎఫ్ఏసీగా పనిచేస్తున్న సీఈఓను ఎంపిక చేసి జాబితాలో పంపినట్లు సమాచారం. ఆ ముగ్గురూ చైర్మన్‌పై ఒత్తిడి చేసి నియామకానికి అడ్డంకులు సృష్టిస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. నూతన చైర్మన్ బ్యాంకులో తన మార్కు చూపిస్తున్నారు. ఆత్మకూరు బ్రాంచ్‌లో నకిలీ పట్టాలకు రుణాలు ఇచ్చిన ఘటనలో ఐదుగురు అధికారులను సస్పెండ్ చేసి, మరో ఇద్దరు అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. తాజాగా మరో ఏడుగురు అధికారులను బదిలీ చేశారు.

రాజకీయాలు చేస్తే సహించేది లేదు



గతంలో బ్యాంకులో ఏమి చేశారో నాకు అవసరం లేదు. ఇప్పుడు మాత్రం బ్యాంకులో రాజకీయాలు చేయాలని చూస్తే సహించేదిలేదు. గతంలో ఇష్టానుసారంగా రుణాలు ఇచ్చినట్లు చెబుతున్నారు. ఇప్పుడు సొసైటీలను ఆన్‌లైన్ చేసి అర్హులైన రైతులందరికీ ఏడాది పొడవునా పంట రుణాలు ఇవ్వాలని నిర్ణయించాం. ఎవరు ఏమి చెప్పినా...నిజాయితీ, నిబద్ధతకే పట్టం కడతాం. సీఈఓ నియామకంలో ఆప్కాబ్ ఉత్తర్వులు, నిబంధనల ప్రకారం నడుచుకుంటాం. ఆప్కాబ్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలలో ఎంపికైన అభ్యర్థినే సీఈఓగా నియమిస్తారు. ఇందులో ఎవరి ప్రమేయం ఉండదు.

-ముంటిమడుగు కేశవరెడ్డి, చైర్మన్, ఏడీసీసీ బ్యాంకు



సమావేశంలో మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా

ఉపాధ్యాయ సమస్యలపై రణభేరి: యూటీఎఫ్

అనంతపురంవిద్య, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం రణభేరి జాతర చేపట్టినట్లు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మీరాజా, జయచంద్రారెడ్డి తెలిపారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని నేతాజీ మున్సిపల్ స్కూల్‌లో జిల్లా కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సంస్కరణల పేరుతో ఉపాధ్యాయులను అనేక రకాలుగా ఇబ్బంది పెడుతున్నారని అన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీచర్లను మానసికంగా వేధించడంతో పాటు పీఆర్సీలో తీరని అన్యాయం చేసిందని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చి మరిచిపోయారని మండిపడ్డారు. వేల కోట్లు బకాయిలు ఉన్నాయని, డీఏలు చెల్లించలేదని, పీఆర్సీపై మీనమేషాలు లెక్కిస్తున్నారని పేర్కొన్నారు. వీటి సాధన కోసం యూటీఎఫ్ రాష్ట్ర వ్యాప్తంగా రణభేరి జాతర చేపడుతోందన్నారు. సోమవారం కర్నూలు జిల్లాలో మొదలై మంగళవారం జిల్లాలోని గుంతకల్లులోకి ప్రవేశించి ఉరవకొండ, కళ్యాణదుర్గం మీదుగా అనంతపురం చేరుకొని ఇక్కడ ర్యాలీగా కలెక్టరేట్ వద్దకు చేరుకొని నిరసన చేపడతామన్నారు. ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గోవిందరాజులు, లింగమయ్య, నాయకులు రమణయ్య, రామప్ప, సరళ, రాఘవేంద్ర, ప్రమీల, సంజీవ్, సుబ్బరాయుడు, వెంకటేశులు, శివానంద పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

● కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపాన్ని తిలకిస్తున్న జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్

లేపాక్షి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా వీరభద్రస్వామి ఆలయంలో శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని కర్ణాటక హై కోర్టు న్యాయమూర్తి జస్టిస్ దినేష్‌కుమార్ సింగ్ పేర్కొన్నారు. ఆదివారం ఆయన లేపాక్షిని సందర్శించారు. ఈ సందర్భంగా ఆలయంలోని ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణ మండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని పరిశీలించారు. నాట్యమండపంలో తైలవర్ణాలతో తీర్చిదిద్దిన రామాయణ, మహాభారత చిత్రాలను సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. తహసీల్దార్ సౌజన్యలక్ష్మీ, దేవదాయశాఖ సిబ్బంది ఆయన వెంట ఉన్నారు.

అపూర్వ కలయిక



హర్షం వ్యక్తం చేస్తున్న పూర్వ విద్యార్థుల

తాడిపత్రి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ కాలం తర్వాత మిత్రులందరూ ఒకచోటికి చేరారు. 1976-79 మధ్య కొడినహళ్లిలో చదివిన విద్యార్థులు ఆదివారం తాడిపత్రి పట్టణంలోని ఏపీఆర్ ప్యారడైజ్‌లో కలుసుకున్నారు. వివిధ రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న స్నేహితులందరూ ఒకేచోట కలిసి సమావేశం నిర్వహించుకున్నారు. వివిధ ఉద్యోగాల్లో ఇతర ప్రాంతాల్లో ఉన్న వీరందరూ ఆరునెలల నుంచి ప్రయత్నించి ఒక దగ్గరకు చేరారు. ఇన్ని సంవత్సరాల తర్వాత అందరూ కలవడంతో వారి ఆనందానికి హద్దులు లేవు. కేరింతలు కొడుతూ ఒకరికొకరు కౌగిలించుకుంటూ పాతజ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. కార్యక్రమంలో తెలంగాణ సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎస్ శ్రీనివాసరాజు, ఐఆర్ఎస్ రామకృష్ణ, ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ నయిముల్లా, అమరరాజా బ్యాటరీ సీఈఓ రమణ, జనరల్ మేనేజర్ గల్లా విజయనాయుడు, పారిశ్రామిక వేత్త శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు టీకాలు

● పశుసంవర్ధక శాఖ జేడీ సుధాకర్

అనంతపురం అర్బన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ జాయింట్ డైరెక్టర్ సుధాకర్, జిల్లా పశువ్యాధి నిర్ధారణ కేంద్రం ఏడీ రవిబాబు ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వర్షా కాలంలో గోజాతి, గేదె జాతి పశువులకు గాలి కుంటు వ్యాధి సోకే అవకాశం ఉందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సోమవారం నుంచి అక్టోబరు 15వతేదీ వరకు పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయాలని నిర్ణయించిందన్నారు. ఇందులో భాగంగా అనంత జిల్లాకు 3,20,500, సత్యసాయి జిల్లాకు 2,99,600 డోసులు అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. టీకాలు వేసిన పశువుల చెవులకు పోగులు వేసి, ట్యాగ్ రూపంలో ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు.

వాహనమిత్ర ప్రకటనపై ఆటోడ్రైవర్ల హర్షం



సీఎం, డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలతో ఆటో డ్రైవర్లు

రాప్తాడు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): దసరా కనుకగా రాష్ట్ర ప్రభుత్వం అందించే వాహన మిత్ర పథకం తమకు వరమని ఆటో డ్రైవర్లు తెలిపారు. వాహన మిత్ర పథకం కింద ఏడాదికి రూ.15 వేలు ఇస్తామ ని ఇటీవల సూపర్ సిక్స్ సభలో సీఎం చంద్రబాబు ప్రకటించిన విష యం తెలిసిందే. ఇందుకు ప్రసన్నాయపల్లి పంచాయతీలోని చిన్మయ్‌నగర్‌లో ఆటో డ్రైవర్లు హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్, ఎమ్మెల్యే పరిటాల సునీత చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన మిత్ర పథకం ప్రకటించడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు పంజగల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యం

● తల్లిదండ్రులకు అప్పగించిన పోలీసులు



విద్యార్థులను తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

రాప్తాడు, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): అదృశ్యమైన ఇద్దరు విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. మండలంలోని ప్రసన్నాయపల్లి సమీపంలోని ఎల్‌ఆర్‌జీ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న భరత్‌రాజ్, లోకేష్ నాయక్ అనే విద్యార్థులు శనివారం ఉదయం పాఠశాల నుంచి అదృశ్యమైన విషయం తెలిసిందే. దీంతో తల్లిదండ్రులు రాప్తాడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే ఆ ఇద్దరు విద్యార్థులు అనంతపురం రూరల్ మండలం చిన్నకుంట గ్రామంలో గల లోకేష్ నాయక్ వాళ్ల మామ ఇంటికి వెళ్లారు. ఆదివారం తెల్లవారుజామున విద్యార్థుల తల్లితండ్రులకు చిన్నకుంటలోని బంధువులు ఫోన్ చేసి పిల్లలు ఇక్కడికి వచ్చారని చెప్పారు. ఆ విద్యార్థులను పోలీసులు ఆదివారం ఉదయం రాప్తాడు పోలీస్ స్టేషన్ వద్దకు పిలిపించి తల్లిదండ్రులకు అప్పగించారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని 2వ రోడ్డులో గల నేతాజీ సుభాష్ చంద్రబోస్ పాఠశాలలో ఆదివారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఘనంగా జరిగింది. పాఠశాలలో 1990-91వ విద్యా సంవత్సరంలో టెన్త్ చదివిన విద్యార్థులు మళ్లీ ఇన్నేళ్లకు అదే పాఠశాలలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. నాటి జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. నాటి గురువులకు పాదపూజలు చేసి పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమానికి మల్లె చిన్న రామప్ప, పయ్యావుల రామాంజనేయులు, రేపటి రామాంజనేయులు, ఖాజామొహిద్దీన్, శివప్రసాద్, బసవరాజు, చిరంజీవి తదితరులు పర్యవేక్షకులుగా వ్యవహరించారు.

● రాప్తాడు: మండలంలోని గాండ్లపర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1998-1999వ విద్యా సంవత్సరంలో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో గెట్ టు గెదర్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సమావేశమై తొలుత సరస్వతి విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తర్వాత నాటి ఉపాధ్యాయులను సన్మానించారు. పాఠశాలకు రెండు బీరువాలు, 4 టేబుళ్లు, 50 కుర్చీలు, 70 అట్టలు వితరణ చేశారు.

వాల్మీకి ఉద్యోగుల కార్యవర్గాల ఎన్నిక

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వాల్మీకులకు ఎస్టీ హోదాను సాధించడమే లక్ష్యంగా పని చేస్తానని వాల్మీకి ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంగాధర్ పేర్కొన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో రుద్రంపేటలోని వాల్మీకి కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన వాల్మీకి ఉద్యోగుల సర్వసభ్య సమావేశంలో భాగంగా రాష్ట్ర, జిల్లా నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. ఇందులో సంఘం రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా గంగాధర్, ప్రధాన కార్యదర్శిగా కర్నూలుకు చెందిన లక్ష్మీనారాయణ, కోశాధికారిగా శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన ఈశ్వరయ్యను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా సుధాకర్, ప్రధాన కార్యదర్శిగా నారాయణస్వామి తదితర కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

మహిళ అదృశ్యం



నాగమ్మ

గార్లదిన్నె, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవపురం గ్రామానికి చెందిన నాగమ్మ అనే మహిళ అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. వివరాల మేరకు.. సంజీవపురం గ్రామానికి చెందిన అల్లు మోహన్‌నాయుడు తల్లి నాగమ్మ గత కొద్దిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతుండేది. శనివారం ఉదయం గార్లదిన్నె ప్రభుత్వ ఆసుపత్రికి వెళుతున్నట్లు చెప్పి వెళ్లింది. శనివారం సాయంత్రం ఇంటికి రాకపోవడంతో కుమారుడు పలుచోట్ల విచారించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో ఆదివారం సాయంత్రం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. నాగమ్మ ఆచూకీ కోసం గాలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నిరుపేదకు అమ్మ సంస్థ చేయూత

● గుండె శస్త్రచికిత్స కోసం రూ.1.20లక్షలు అందజేత



లక్ష్మీనారాయణకు ఆర్థికసాయం చేస్తున్న తరిమెల రమణారెడ్డి

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉన్న ఓ నిరుపేదకు అమ్మ సంస్థ చేయూతనందించి అండగా నిలిచింది. స్థానిక నాయక్‌నగర్‌కు చెందిన చాకలి లక్ష్మీనారాయణ, సావిత్రమ్మ దంపతులు రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగించేవారు. అయితే ఇటీవల లక్ష్మీనారాయణకు ఛాతీలో నొప్పి రావడంతో భార్య, స్థానికులు ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి గుండెలోని ప్రధాన 3 రక్తనాళాలు బ్లాక్ అయ్యాయని, బైపాస్ సర్జరీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. దీంతో హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి వెళ్లగా శస్త్ర చికిత్సకోసం రూ.3.30లక్షలు ఖర్చవుతుందని అక్కడి వైద్యులు పేర్కొన్నారు. దీంతో కొన్నేళ్లుగా తాము పోగు చేసుకున్న డబ్బు రూ.2లక్షలు ఉండగా మిగిలిన డబ్బుకోసం బంధువులు, తెలిసినవారిని ఆశ్రయించారు. ఎవరినుంచి డబ్బు లభించకపోవడంతో చేయూత కోసం అమ్మ సంస్థను ఆశ్రయించారు. స్పందించిన సంస్థ అధ్యక్షుడు తరిమెల రమణారెడ్డి ఆదివారం లక్ష్మీనారాయణను కలిసి శస్త్ర చికిత్స కోసం రూ.1.20 లక్షలు నగదును అందజేశారు.

కనీస సౌకర్యాలూ కరువే..

● మరూరు చిన్నకదిరయ్య స్వామి ఆలయంలో వసతులు నిల్

● మరుగుదొడ్లు, తాగునీటి సౌకర్యాలు కూడా లేని దుస్థితి

● ఇబ్బంది పడుతున్న భక్తులు

రాప్తాడు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన మరూరు చిన్నకదిరయ్యస్వామి ఆలయంలో పలు సమస్యలు తిష్టవేశాయి. కనీస సౌకర్యాలైన మరుగుదొడ్లు, తాగునీరు కూడా లేకపోవడంతో ప్రతి శనివారం ఆలయానికి వచ్చే భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సౌకర్యాలు కల్పించేందుకు, అభివృద్ధి పనులు చేపట్టేందుకు తగినన్ని నిధులు ఉన్నా ఆలయ కమిటీ సభ్యులు పట్టించుకోలేదని భక్తులు ఆరోపిస్తున్నారు.

మరూరు గ్రామంలో వెలసిన చిన్నకదరయ్యస్వామి ఆలయం ఎంతో ప్రసిద్ధి గాంచినది. కొలిచిన వారి కోరికలను స్వామివారు తప్పక నెరవేరుస్తారనేది భక్తుల నమ్మకం. శనివారం వచ్చిందంటే స్వామి దర్శనం కోసం ఉమ్మడి అనంతపురం జిల్లా నలుమూలల నుంచే గాక కర్ణాటక నుంచి సైతం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. సాయంత్రం ఆలయం వద్దకు చేరుకుని రాత్రి అక్కడే నిద్ర చేసి ఆదివారం ఉదయాన్నే తిరిగి వెళతారు. అయితే ఆలయం వద్ద కనీస సౌకర్యాలు కల్పించడంలో ఆలయ కమిటీ సభ్యులు విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఆలయం వద్ద గతంలో నిర్మించిన మరుగుదొడ్లు నిరుపయోగంగా ఉన్నాయి. భక్తులు వాటిల్లోకి వెళ్లకుండా ముళ్ల కంపను అడ్డుగా వేశారు. ఆలయ ప్రాంగణం వద్ద నూతన మరుగుదొడ్ల నిర్మాణాన్ని ఏడాది కిందట ప్రారంభించారు. 80 శాతం పనులు పూర్తి చేసి నిలిపివేశారు. దీంతో భక్తులకు ఆలయం వద్ద మరుగుదొడ్లు లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా మహిళల పరిస్థితి దారుణంగా ఉంది. కాలకృత్యాలు తీర్చుకోవాలంటే ఆరుబయటకు కంపచెట్లలోకి వెళ్లాల్సి వస్తోంది. ఇక స్నానం చేసి బట్టలు మార్చుకోవడానికి ప్రత్యేక గదులు కూడా లేవు. అంతేకాకుండా ఆలయం వద్ద తాగునీరు కూడా కరువే. గతంలో తాగునీటి కోసం ఏర్పాటు చేసిన ట్యాంకులు మూడేళ్లుగా నిరుపయోగంగా ఉంటున్నాయి. చేసేదిలేక భక్తులు వాటర్ బాటిళ్లను కనుక్కోవాల్సి వస్తోంది. ప్రసిద్ధి చెందిన ఆలయం వద్ద పరిస్థితి ఇలా ఉండడం పట్ల భక్తులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.



చిన్న కదిరయ్యస్వామి మూలవిరాట్



ఆలయం వద్ద నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంకులు



నిరుపయోగంగా ఉన్న పాత మరుగుదొడ్లు



అర్ధాంతరంగా ఆగిన మరుగుదొడ్ల నిర్మాణం

ఆగిన అన్నదానం

చిన్నకదిరయ్యస్వామి ఆలయం వద్ద ప్రతి శనివారం అన్నదాన కార్యక్రమం జరిగేది. చట్టు పక్కల గ్రామాలకు చెందిన రైతులు బియ్యం, కంది బేడలు, కూరగాయలు అన్నదానానికి విరాళంగా ఇచ్చేవారు. దాతలు ఇచ్చిన బియ్యం, కూరగాయలతో ప్రతి శనివారం భోజనం వండి భక్తులకు వడ్డించేవారు. అయితే కరోనా సమయంలో అన్నదానం ఆగింది. కరోనా పూర్తయినా మళ్లీ చేపట్టలేదు. క్రమేణా అన్నదాన కార్యక్రమం మరుగున పడింది. ఆలయ వద్ద సౌకర్యాలు కల్పించాలని, ప్రతి శనివారం అన్నదానం చేపట్టాలని, ఆలయ నిధులతో అభివృద్ధి పనులు చేపట్టాలని భక్తులు కోరుతున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయండి

● కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న కొత్తూరు ఆర్యవైశ్య సంఘం నాయకులు

అనంతపురంటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కొత్తూరు వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈ నెల 22 నుంచి అక్టోబరు 3వ తేదీ వరకు నిర్వహించనున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయాలని కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు పిలుపునిచ్చారు. ఉత్సవాలకు సంబంధించిన బ్రోచర్లను ఆదివారం ఆయన ఆవరణ లో ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ... ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న ఈ ఉత్సవాల్లో అమ్మవారి మూలవిరాట్‌తో పాటు కల్యాణమండపంలో ఉత్సవమూర్తులకు రోజుకో అలంకారం చేసి విశేష పూజలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో హాజ రై ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు పురుచూరు సూర్యప్రకాష్, టంగుటూరు నాగభూషణం, కృష్ణం రఘు, పొలమడ రమేష్‌బాబు, సతీష్ గుప్తా, సత్రసాల కిశోర్, తల్లం మురళి, జయం సురేష్, కురిడి వెంకటేష్, శృజన్ కుమార్, వెంకటకృష్ణ, నామా సత్యనారాయణ, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛం ఇస్తున్న ఆవులక్రిష్ణయ్య, గంగులకుంట రమణ, విశాలాక్షి

గార్లదిన్నె, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): బీసీలకు ప్రత్యేక రక్షణ చట్టం అమలు చేయాలి టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఆవులక్రిష్ణయ్య కోరారు. విజయవాడలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం పార్టీ బీసీ సదస్సు జరిగింది. ఇందుకు ఆవులక్రిష్ణయ్యతో పాటు గాండ్ల తెలికుల సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షురాలు గాండ్ల విశాలాక్షి, కురుబ సాధికార సమితి రాష్ట్ర అధ్యక్షుడు గంగులకుంట రమణ హాజరై బీసీసెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మంత్రి కొల్లు రవీంద్రను కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శాలువాతో సత్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఎన్నికల ముందు బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలన్నారు. అదే విధంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లలో ప్రాధాన్యత కల్పించాలని, బీరప్ప స్వాముల పూజర్లకు వేతనాలు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఇందుకు మంత్రి కొల్లు రవీంద్ర సానుకూలంగా స్పందించి వీటిని సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళతామని తెలిపారు.

ఆర్‌డబ్ల్యూఎస్ పీఏ టూ ఎస్‌ఈగా శ్రీరాములు



అనంతపురం న్యూటౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగం పీఏ టూ ఎస్‌ఈగా శింగనమల డివిజన్ డీఈ శ్రీరాములును నియమిస్తూ ఈఎన్‌సీ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పీఏటూ ఎస్‌ఈగా ఉన్న రంగయ్య గత జూన్ ఆఖరిలో రిటైర్డ్ అయ్యారు. దీంతో ఆ స్థానంలోకి రాయదుర్గం డీఈగా ఉన్న రామారావును నియమించారు. అయితే సత్యసాయి బోర్డు డీఈగా ఉన్న శ్రీనివాసులు ఈఈగా పదోన్నతిపై పులివెందులకు బదిలీపై వెళ్లగా.. సత్యసాయి బోర్డు డీఈ బాధ్యతలు కూడా రామారావుకే అప్పగించారు. దీంతో అతడికి బాధ్యతలు ఎక్కువ అవుతాయని భావించి పీఏ టూ ఎస్ఈ స్థానాన్ని శింగనమల డివిజన్ డీఈ శ్రీరాములుకు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఆయన సోమవారం బాధ్యతలు చేపట్టే అవకాశం ఉన్నట్లు సమాచారం.

అంగన్‌వాడీలకు కనీస వేతనాలు ఇవ్వాలి: సీఐటీయూ



మాట్లాడుతున్న ఓబులు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కార్మికులకు కనీస వేతనాలు చెల్లించాల్సిందేనని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మార్చిన నేపథ్యంలో ఆదివారం మెడికల్ రెప్స్ కార్యాలయంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల అధ్యక్షతన అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ.. మినీ అంగన్‌వాడీలను మెయిన్ అంగన్‌వాడీలుగా మారుస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం శుభపరిణామం అన్నారు. అంగన్‌వాడీలు చాలీచాలని వేతనాలతో దుర్భర జీవితాలను గడుపుతున్నారని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో 42 రోజులపాటు అంగన్‌వాడీల సమస్యలపై పోరాటాలు సాగించినట్లు తెలిపారు. కనీస వేతనాల అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమాదేవి, మెడికల్ రెప్స్ యూనియన్ నాయకుడు రాజమోహన్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర కుమార్, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు కాత్యాయని, శ్రీదేవి, రేష్మ, మహాలక్ష్మి, ధనలక్ష్మి, విజయ, కల్యాణి పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.17

అనంతపురం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో ఆదివారం టమోటాలు కిలో గరిష్ఠంగా రూ.17తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అదేవిధంగా కనిష్ఠ ధర రూ.10, సరాసరి ధర రూ.14తో విక్రయాలు జరిగాయన్నారు. మార్కెట్‌కు 1950టన్నుల టమోటాలు వచ్చినట్లు పేర్కొన్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.51లక్షలు

అనంతపురం రూరల్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో రెండు రోజుల పాటు జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3.51 లక్షల ఆదాయం వచ్చిందని మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి రాఘవేంద్రకుమార్ ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా రూ.2.20 లక్షలు, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంత ద్వారా రూ.1.30 లక్షల ఆదాయం వచ్చినట్లు పేర్కొన్నారు.

రెవరెండ్ బెన్‌హర్‌బాబు బాధ్యతలు

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సుదీర్ఘ చరిత్ర కలిగిన సీఎస్ఐ రాయలసీమ డయాసిస్ బిషప్ కమిషనరీగా రెవరెండ్ పాస్టర్ బెన్‌హర్ బాబు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఈ స్థానంలో ఉన్న బిషప్ రెవరెండ్ డాక్టర్ ఐజక్ వరప్రసాద్ ఆధ్యాత్మిక యాత్రలో భాగంగా టర్కీకి వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆయన స్థానంలో రెవరెండ్ బెన్‌హర్‌బాబు ఆదివారం అరవిందనగర్ సీఎస్ఐ హోలీ ట్రినిటి చర్చిలో ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టారు. టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్‌తోపాటు సంఘ సభ్యులు బెన్‌హర్‌బాబుకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

గోరంట్ల, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదిలి క్రాస్ వద్ద గల జాతీయ రహదారిపై కంటెయినర్‌ను స్కార్పియో ఢీకొనడంతో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. అనంతపురానికి చెందిన మనోహర్ కుటుంబం స్కార్పియో వాహనంలో బెంగుళూరుకు వెళ్లారు. ఆదివారం తిరిగి అనంతపురానికి బయలు దేరారు. అయితే బూదిలి క్రాస్ వద్ద గల కె హోటల్ సమీపంలోకి రాగానే ముందు వెళ్తున్న కంటెయినర్‌ను స్కార్పియో ఢీకొంది. ఈ ప్రమాదంలో అందులో ప్రయాణిస్తున్న మనోహర్, విజయలక్ష్మి దంపతులు, కుమారై శరణ ఆజిల్, మనవరాలు సిగ్నిత్ శరణా అజిత్ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు హైవే అంబులెన్స్ ద్వారా చికిత్స నిమిత్తం పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరుడు

ఆత్మకూరు సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు ఉదయమే స్వామివారి మూల విరాట్‌కు పంచామృతాభిషేకం, ప్రత్యేక అలంకరణలు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు చేసి మహానేవేద్యం సమర్పించి మహా మంగళహారతి ఇచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చిని స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. అన్నదాన కమిటీ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయ నిర్వహణా అధికారి బాబు, ప్రధాన అర్చకులు రాముస్వామి పాల్గొన్నారు.

అవార్డులు పొందిన టీచర్లకు సత్కారం

అనంతపురం విద్య, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇటీవల గురుపూజోత్సవం సందర్భంగా ఉత్తమ అవార్డులు పొందిన టీచర్లను ఏపీటీఎఫ్ 1938 నా యకులు సత్కరించారు. జిల్లాకేంద్రంలోని ఎన్జీఓ హోమ్‌లో ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి డీఈఓ ప్రసాద్‌బాబు, ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు హృదయరాజు ముఖ్యఅతిథులుగా పాల్గొని అవార్డులు పొందిన పలువురు టీచర్లను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు, సంఘాలు ప్రత్యేక చొరవతో పని చేయడం వల్లనే జిల్లాలో విద్యావికాసాభివృద్ధి సాధ్యమవుతోందన్నారు. హృదయరాజు మాట్లాడుతూ కూటమి సర్కారు ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు, ఉద్యోగులకు ఎన్నోహామీలిచ్చి ఇపుడు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అమలు చేయాలని కోరారు. లేకపోతే పెద్దఎత్తున ఉద్యమాలు చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. సంఘం రాష్ట్రపూర్వప్రధానకార్యదర్శి కులశేఖరరెడ్డి, జిల్లా అధ్యక్షప్రధానకార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, శ్రీనివాసనాయక్, నాయకులు వెంకటరెడ్డి, వెంకటసుబ్బయ్య, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు టైమ్‌స్కేల్ అమలు చేయాలి

అనంతపురం విద్య, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): సమగ్రశిక్ష ఆధ్వర్యంలో పాఠశాలల్లో పని చేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్లకు మినిమం టైమ్ స్కేల్ రూపంలో వేతనాలు చెల్లించాలని పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం ఉమ్మడి జిల్లా జేఏసీ కన్వీనర్ విజయ్ డిమాండ్ చేశారు. జిల్లాకేంద్రంలోని పొట్టిశ్రీరాములు మున్సిపల్ పాఠశాలలో ఆదివారం పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సమావేశం జరిగింది. ఇందులో విజయ్ మాట్లాడుతూ.. దాదాపు 14 ఏళ్లుగా పని చేస్తున్నా జీతాలు పెంచకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందన్నారు. పార్ట్‌టైమ్ అనేపదాన్ని తొలగించి స్పష్టమైన జాబ్ చార్ట్ ఇచ్చి వేతనాలు పెంచి ఇవ్వాలన్నారు. జీతాలు ప్రతినెలా ఒకటో తేదీన ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ల సంఘం నాయకులు దివాకరరావు, ఈశ్వరయ్య, చంద్రకళ, నరేంద్ర, మధు, గీత, గౌతమి, దీప, శ్రీదేవి, రాజేష్, సుమలత తదితరులు పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌కు సన్మానం



రంగాచారిని సత్కరిస్తున్న దృశ్యం

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): ఏపీ విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా కుర్లపల్లి రంగాచారి నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం రాత్రి రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఆదివారం విశ్వబ్రాహ్మణులు, స్వర్ణకారులు, టీడీపీ నాయకులతో పాటు పలువురు ఆయన్ను నగరంలోని నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతపురం లీగల్ సెల్ ఛైర్మన్ గురుప్రసాద్, టీడీపీ నాయకులు సరిపూటి రమణ, కృష్ణకుమార్, రాయల్ మురళి, సుంకన్న, భూమా బాల, విశ్వబ్రాహ్మణుల సంఘం నాయకులు ప్రకాష్ ఆచారి, బాలాచారి, కృష్ణమాచారి తదితరులు రంగాచారినిపూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

ఘనంగా కోటి కుంకుమార్చన

అనంతపురం టౌన్, సెప్టెంబరు 14 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీటీడీ కళ్యాణమండపంలో ఆదివారం మాతృదేవి విశ్వశాంతి ఆశ్రమం ఆధ్వర్యంలో కోటి కుంకుమార్చన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా వందలాదిమంది భక్తులు సామూహికంగా అమ్మవారి నామస్మరణ చేస్తూ కుంకుమార్చన చేశారు. అనంతరం మహామంగళహారతి నివేదనానంతరం పెద్దఎత్తున అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల తదితరులు పాల్గొన్నారు.



కోటి కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలి: ఎమ్మార్పీఎస్



సోములదొడ్డిలో పొలికేక పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

అనంతపురంరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో పేదలకు ఎన్నో సేవలు అందిస్తూ అండగా ఉంటున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏను వెంటనే రెన్యువల్ చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు బీసీఆర్ దాస్ డిమాండ్ చేశారు. ఆ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ఎస్సీఎస్టీ అఖిల పక్ష కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన పొలికేక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండలంలోని సోములదొడ్డి, చంద్రబాబు నగర్, ఎస్‌ఆర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా డండోరా వేయించారు. అలాగే పొలికేక పోస్టర్లను విడుదల చేశా రు. అనంతరం మాట్లాడుతూ.. ఆర్డీటీ పట్ల రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఢిల్లీకి వెళ్లి కేంద్ర హోం మంత్రి అమిత్ షాను కలిసి తెలిపినా స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ రెన్యూవల్‌లో కేంద్రం నిర్లక్ష్య ధోరణి అవలంభిస్తోందన్నారు. పేదలకు మంచిచేసే సంస్థల విషయంలో కేంద్ర వైఖరి మారాలన్నారు. లేనిపక్షంలో ఎస్సీఎస్టీల ఆధ్వర్యంలో నిరసనలు వెలువెత్తుతూనే ఉంటాయన్నారు. 15వ తేదీన జరిగే పొలికేక కార్యక్రమంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత నాయకులు పాల్గొన్నారు.

పల్లెల్లో ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ నాయకుల ప్రచారం

అనంతపురం వైద్యం: ఆర్డీటీ పరిరక్షణకు ప్రజామద్దతు కోసం గ్రామాల పర్యటన చేపట్టామని ఎస్సీ, ఎస్టీ అఖిలపక్ష కమిటీ నాయకులు అక్కులప్ప పేర్కొన్నారు. ఈ మేరకు పల్లెల్లో పర్యటించి ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ను రెన్యువల్ చేయాలంటూ నగరంలో ఈనెల 15న తలపెట్టిన ప్రజా పొలికేకకు తరలిరావాలంటూ గ్రామాల్లో ప్రచారం చేపట్టామన్నారు. పొలికేకకు సంబంధించిన పోస్టర్లను కూడా ఆవిష్కరించామన్నారు. నగరంలోఆర్ట్స్ కళాశాలనుంచి కలెక్టర్ కార్యాలయం వరకు వేలాదిమందితో పొలికేక ర్యాలీ నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలో రేపు ర్యాలీ..

ఆర్డీటీని రక్షించుకుందాం.. అనంతను కాపాడుకుందాం అనే నినాదంతో న్యాయవాదుల జేఏసీ ఆధ్వర్యంలోనూ నగరంలో 15న ర్యాలీ నిర్వహిస్తున్నట్లు బహుజన లాయర్స్ ఫోరమ్(బీఎల్ఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు నారాయణప్ప తెలిపారు. స్థానిక బీఎల్ఎఫ్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన కార్యాచరణ ప్రకటించారు. ఈ మేరకు 15వ తేదీన ర్యాలీ, 16న సంతకాల సేకరణ, 17న ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలందజేత కార్యక్రమాలు తలపెట్టినట్లు వివరించారు. న్యాయవాదుల జేఏసీ నాయకులు మహేశ్వరి, నారాయణరెడ్డి, నాగన్న, వేణుగోపాల్, సూర్యచంద్ర, నరసింహులు, రంగనాయకులు, నల్లప్ప, విజయభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

సౌకర్యాలు లేని గురుకులం

- రాగులపాడు పాఠశాలలో విద్యార్థుల పాట్లు
- అందరూ అవుట్ సోర్సింగ్ టీచర్లే
- పలు పోస్టులు ఖాళీ
- రెండు నెలలుగా సెలవులో వార్డన్



గురుకుల పాఠశాల భవనం


పాఠశాలలో ఉన్న మరుగుదొడ్లు


భోజనం కోసం రోడ్డు దాటుతున్న విద్యార్థులు

ఉరవకొండ, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు గిరిజన సంక్షేమ బాలుర గురుకులం పాఠశాలలో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. 2016లో ఈ పాఠశాలను ఏర్పాటు చేశారు. 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఉన్న ఈ పాఠశాలలో 70 మంది దాకా విద్యార్థులున్నారు. పాఠశాలలోని మరుగుదొడ్లు, స్నానపుగదులు తగినన్ని లేవు. 70 మందికి నాలుగు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. విద్యార్థులు ఉండటానికి ప్రత్యేక గదులు లేకపోవడంతో తరగతి గదుల్లోనే ఉంటున్నారు. ప్రస్తుత గురుకులం పాఠశాల భవనంలో వంటలు చేసేందుకు, భోజనాలు చేసేందుకు సదుపాయం లేకపోవడంతో రోడ్డుకు అటువైపు ఉన్న గురుకులం పాత భవనంలోనే ఈ సౌకర్యాలు కల్పించారు. దీంతో భోజనం కోసం పాఠశాలకు ఎదురుగా.. రోడ్డుకు అటువైపు ఉన్న వసతి గృహానికి విద్యార్థులు వెళ్లాల్సి వస్తోంది. ఉరవకొండ-గుంతకల్లు ప్రధాన రహదారి కావడం వల్ల నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు వెళ్తూ ఉంటాయి. విద్యార్థులు రోజుకు ఆరు సార్లు రోడ్డు దాటాల్సి వస్తోంది. ప్రమాదాలు జరిగే అవకాశముంది.

● ఆరుగురూ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులే..: గురుకులంలో పనిచేస్తున్న ఆరుగురు ఉపాధ్యాయులూ ఔట్‌సోర్సింగ్ విధానంలోనే పనిచేసేవారే. రెండేళ్లుగా హిందీ, పీఈటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. రెండునెలలుగా వార్డెన్ కూడా సెలవులో వెళ్లాయి.

ఈ సమస్యలపై డీటీడబ్ల్యూఓ శ్రీనివాసరావును వివరణ కోరగా.. మరుగుదొడ్ల కొరకు ఇప్పటికే ప్రతిపాదనలు పంపామని, పాఠశాలలో వసతి, భోజనం ఒకే చోట ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, కొత్తగా ప్రిన్సిపాల్ కూడా బాధ్యతలు చేపట్టారని తెలిపారు.

న్యూస్ బాక్స్

రోడ్డుపై గుంతల పూడ్చివేత


రోడ్డుపై గుంతలు పూడ్చుతున్న యువకులు

శెట్టూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): శెట్టూరు నుంచి కళ్యాణదుర్గం వెళ్లే ప్రధాన రహదారిపై గుంతలు పడటంతో.. ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇది గమనించిన హెల్పింగ్ హ్యాండ్ సభ్యులు నవీన్, మహేష్, బాలరాజ్, సురేష్, సత్యనారాయణ ఆదివారం శ్రమదానం చేశారు. రోడ్డుపై ఉన్న గుంతలను సిమెంటు, కంకరతో కలిపి పూడ్చి వేశారు. వీరిని ప్రయాణికులు అభినందించారు.

నిరుద్యోగ భృతి ఇవ్వాలి

రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం నిరుద్యోగ భృతిని ఇచ్చి.. నిరుద్యోగులను ఆదుకోవాలని ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు కావలి కొట్రేష్, తాలూకా అధ్యక్ష కార్యదర్శులు కుమార్, నాయక్, నాగయ్య కోరారు. ఆదివారం స్థానిక ఆ కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. ఈ హామీని అమలు చేయాలని విజయవాడలో బుధవారం నిరుద్యోగి ఆవేదన సదస్సును నిర్వహిస్తున్నామని, అధిక సంఖ్యలో నిరుద్యోగులు హాజరై దీన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉచితంగా రక్త పరీక్షలు

తాడిపత్రి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక చిన్నబజారులో ఫయాజ్‌బాషా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత రక్తపరీక్షలు, షుగర్, బీపీ పరీక్షలను ఆదివారం నిర్వహించిన ఆ సేవా ట్రస్ట్ చైర్మన్ ఫయాజ్‌బాషా తెలిపారు. దాదాపు నాలుగు సంవత్సరాలు ఈ కార్యక్రమాన్ని, ఎవరైనా సేవా ట్రస్ట్ ద్వారా ఈ పరీక్షలు చేయించుకోవచ్చని తెలిపారు. గర్భిణులకు, షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా రక్త పరీక్షలు నిర్వహిస్తామని, వివరాలకు 89191 37907ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి టీకాలు

గుత్తి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): జాతీయ పశువ్యాధి నివారణ పథకం కింద సోమవారం నుంచి నెల రోజుల పాటు గాలికుంట వ్యాధి నివారణకు టీకాలు వేస్తామని ప్రాంతీయ పశువైద్యశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ భారతి తెలిపారు. గుత్తి, పెద్దవడుగూరు, పామిడి మండలంలోని పశువులకు ఈ టీకాలు వేయించుకోవాలని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రోగికి ఆర్థిక సాయం

తాడిపత్రి, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లా కొలిమిగుండ్ల మండలం పెట్నికోట గ్రామానికి చెందిన వెంకటలక్షుమ్మ కేన్సర్‌తో బాధపడుతోంది. ఆర్థిక ఇబ్బందులు పడుతున్న ఆమెకు.. పట్టణంలోని ఉద్యోగ, ఉపాధ్యాయ సామాజిక సేవా సంస్థ సభ్యులు స్థానిక వివేకానంద పాఠశాలలో ఆదివారం రూ. 12 వేలు అందజేశారు. ఇందులో బరోడా బ్యాంక్ మేనేజర్ రాజేష్, సభ్యులు రామేశ్వరరెడ్డి, విజయలక్ష్మి, చంద్రశేఖర్, రాజేష్, శంకర్ పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి మృతి

గుత్తిరూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని లచ్చానిపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు నాగరాజు (60) అనారోగ్యంతో ఆదివారం మరణించాడు. ఆయన మృతదేహానికి టీడీపీ జిల్లా అధ్యక్షుడు, కార్మిక సంక్షేమ శాఖ బోర్డు చైర్మన్ వెంకటశివుడు యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కుమారుడు గుమ్మనూరు ఈశ్వర్ నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి వెంట మార్కెట్ యార్డు చైర్మన్ ప్రతాప్, నూర్‌బాషా కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బర్కీవలి, టీడీపీ మండల, పట్టణ కన్వీనర్లు లక్ష్మిరంగయ్య, ఏంకే చౌదరి, టీడీపీ నాయకులు చికెన్ శీనా, సర్పంచు లింగమయ్య ఉన్నారు.

ఆటో డ్రైవర్లకు కూటమి అండ: ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): ఆటో డ్రైవర్లకు కూటమి ప్రభుత్వం అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వాహన మిత్ర పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు ఆర్థికసాయం అందచేస్తూ వారి ఆర్థిక అభ్యున్నతికి కృషి చేస్తోందన్నారు. ఈనెల 17 నుంచి గ్రామ, వార్డు సచివాలయ ద్వారా కొత్త దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు.

ప్రతి ఆటో డ్రైవర్‌కూ వర్తింపజేయాలి

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): లైసెన్సు ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కూ వాహన మిత్ర అమలు చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. ఆ పథకంలో పెట్టిన అంక్షలు ఎత్తివేయాలన్నారు.

రిజర్వాయర్‌కు 2,356 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు 2,356 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో 2316 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. రిజర్వాయర్‌లో 1.718 టీఎంసీలు నీటి నిల్వ ఉందని, ఫేజ్-2కు 1,962 క్యూసెక్కుల నీరు వెళ్తోందని తెలిపారు.

బిల్లుల కోసం రైతుల నిరీక్షణ

శెట్టూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మొట్ట భూముల్లో పండ్లతోటల పెంపకానికి సంబంధించిన బిల్లులు అందక మండలంలోని పలువురు రైతులు మూడేళ్లుగా ఎదురుచూస్తున్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద సుమారు వెయ్యి ఎకరాల్లో మొట్ట భూముల పండ్లతోటల కార్యక్రమాన్ని చేపట్టారు. మూడేళ్లయినా ప్రభుత్వం నుంచి బిల్లులు అందకపోవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుమారు మండలానికి రూ. కోటి దాకా బిల్లులు అందాల్సి ఉంది. ప్రభుత్వం స్పందించి ఈ బిల్లులు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


రోడ్డులో ఏర్పడిన గుంత

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోవిందవాడ గ్రామ సమీపంలోని దర్గాహొన్నూరు రోడ్డుపై ఇలా భారీ గుంత ఏర్పడింది. ఈ రోడ్డుపై బొమ్మనహాళ్, ఉరవకొండ, బళ్లారి ప్రాంతాలకు నిత్యం భారీ సంఖ్యలో వాహనాలు వెళ్తుంటాయి. ద్విచక్రవాహనదారులు అనేక మంది ఈ కారణంగా కింద పడి గాయపడ్డారు. భారీ ప్రమాదం జరగకముందే అధికారులు స్పందించి .. ఈ గుంతను పూడ్చివేసేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

నేడు జాతీయ సదస్సు

గుంతకల్లుటౌన్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మేధో సంపత్తి హక్కులపై జాతీయ సదస్సును సోమవారం నిర్వహిస్తున్నట్లు కళాశాల వైస్ ప్రిన్సిపాల్ రవి వంకర్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. చెన్నై పేటెంట్ కార్యాలయ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు.

తిమ్మంపల్లి ఆలయాల్లో జేసీపీఆర్ పూజలు


కొడవండ్లపల్లిలో అనుచరులతో కలిసి వస్తున్న జేసీపీఆర్

యల్లనూరు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆదివారం తిమ్మంపల్లి గ్రామంలో ఆంజనేయస్వామి, వెంకటరమణస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చింతకాయమంద గ్రామానికి చెందిన కేశవరెడ్డి ఇంటికి వెళ్లాడు. అనంతరం తిమ్మంపల్లి గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి, నూతనంగా నిర్మించిన వెంకటరమణస్వామి గుడిలో పూజలు నిర్వహించారు. అక్కడి నుంచి అనుచరులతో కలిసి కొడవండ్లపల్లికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్దమ్మ ఆలయం వద్ద అనుచరులు జయరామకృష్ణ, రవీంద్రారెడ్డి, జనార్దన్‌రెడ్డి, మోహన్‌నాయుడు, పాపానాయుడు ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్నాడు. అక్కడికి వచ్చిన పుట్లూరు, యల్లనూరు నాయకులతో సమస్యలపై ఆరా తీశారు. ఆయన వెంట ఎస్వీ రవీంద్రారెడ్డి, యల్లనూరు మండల కన్వీనర్ రామాంజనేయులు, డైరెక్టర్ సుబ్బారాయుడు, సర్పంచు కుల్లాయప్ప, రామకృష్ణారెడ్డి, రాము, నరేంద్ర ఉన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం


పవిత్రకు నగదు అందిస్తున్న టీడీపీ నాయకులు

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనేహాళ్ గ్రామానికి చెందిన సురేష్ వారం క్రితం విద్యుదాఘతానికి మరణించిన విషయం తెల్సిందే. ఆ కుటుంబానికి ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు రూ. 25 వేలు ఆర్థిక సహాయం ప్రకటించారు. స్థానిక టీడీపీ నాయకలు కేశవరెడ్డి, జగన్నాథ్‌రెడ్డి, వెంకటరెడ్డి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి... రూ. 25 వేలను సురేష్ భార్య పవిత్రకు నగదును అందించారు. వారి వెంట టీడీపీ నాయకులు ఏకాంత్ రెడ్డి, మోహన్‌రెడ్డి, తిమ్మరెడ్డి, రంగారెడ్డి, రమేష్, ఉమాపతి ఉన్నారు.

నేటికీ వైసీపీ రంగులే..!



రాయదుర్గం రూరల్, సెప్టెంబరు 14(ఆంధ్రజోతి): ప్రభుత్వం మారి 16 నెలలైనా.. పట్టణంలోని ఒకటో వార్డులో ఉన్న సచివాలయ భవనం రంగు మాత్రం మారలేదు. ఆ భవనానికి నేటికీ వైసీపీ రంగులే ఉన్నాయి. అధికారులు, పాలకులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండటంపై కూటమి నాయకులు, కార్యకర్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని 1వ వార్డు టీడీపీ వార్డు ఇన్‌చార్జి తిప్పేస్వామి, నాయకులు బలె శంకర్ కోరుతున్నారు.

జాతీయ పోటీల్లో ప్రతిభ


పతకాలతో విద్యార్థులు

తాడిపత్రి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా కేంద్రంలోని కన్వెన్షన్ హాలులో ఆదివారం జరిగిన మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా కరాటే పోటీల్లో తాడిపత్రి విద్యార్థులు ప్రతిభ కనబరిచారని మాస్టర్ శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల నుంచి దాదాపు 1600 మంది విద్యార్థులు పాల్గొన్నారని, అండర్-14 విభాగంలో పట్టణానికి చెందిన 11 మంది విద్యార్థులు పాల్గొన్నారని, ఇందులో శ్రీవాణి స్కూల్‌కు చెందిన తొమ్మిది మంది అత్యంత ప్రతిభ కనబరిచారని అన్నారు. ఈ విద్యార్థులకు ఆంధ్రప్రదేశ్ జేఎస్‌కేఎస్ చీఫ్ జనరల్ సెక్రటరీ ప్రభాకర్, శేఖర్, జగదీష్ బహుమతులు అందజేశారన్నారు.

సూపర్ సిక్స్ టోర్నీ విజేత కణేకల్లు ఆర్డీటీ


విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న నిర్వాహకులు

కణేకల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానికంగా రెండురోజులుగా జరిగిన సూపర్‌సిక్స్ టోర్నీలో కణేకల్లు ఆర్డీటీ జట్టు విజేత నిలిచింది. మొత్తం 16 జట్లు ఈ టోర్నీలో పాల్గొనగా ఫైనల్‌కు కణేకల్లు ఆర్డీటీ జట్టు, హనకనహాళ్ జట్టు చేరుకున్నాయి. ఫైనల్ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన కణేకల్లు జట్టు నిర్ణీత ఆరు ఓవర్లకు 63 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన హనకనహాళ్ జట్టు కేవలం 38 పరుగులు మాత్రమే సాధించి 26 పరుగుల తేడాతో ఓటమి చెందింది. విజేతలకు చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, పట్టణ అధ్యక్షుడు అనిల్, హాస్పిటల్ కమిటీ సభ్యుడు కురుబ నాగరాజులు రూ. 10 వేలు, షీల్డును అందజేశారు. రన్నర్స్‌కు క్రీడాకారులు షేక్‌ఫజుల్, పురుషోత్తం, అహ్మద్ రూ. ఐదువేలు, కప్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు అల్తాఫ్, తిప్పేస్వామి, ప్రకాష్, నితీష్, రెడ్డి, బసవరాజు, మణికంఠ పాల్గొన్నారు.

రైల్వే సమస్యలు పరిష్కరించండి


సోమన్నకు వినతిపత్రం ఇస్తున్న మహేశ్వర్

గుంతకల్లు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): అపరిష్కృతంగా ఉన్న రైల్వే సమస్యను పరిష్కరించాలని బీజేపీ ఓబీసీ సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యుడు జీఎం మహేశ్వర్ రైల్వే సహాయ మంత్రి బీ సోమన్నను కోరారు. ఆదివారం బెంగళూరులోని కేంద్ర మంత్రి సోమన్న ఇంటికి వెళ్లిన మహేశ్వర్ ఆయన వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలో ధర్మవరం గేటు స్థానంలో వంతెన నిర్మించి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని, రైల్వే డివిజన్‌లోని పలు సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమావేశం


సమావేశంలో పాల్గొన్న రాయదుర్గం కేటీఎస్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

రాయదుర్గం రూరల్,సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ కేటీఎస్ డిగ్రీ కాలేజ్ 2005-08లో చదువుకొన్న విద్యార్థులు.. ఆదివారం అదే కళాశాలలో సమావేశమయ్యారు. ఆ కళాశాలకు సరస్వతి విగ్రహాన్ని అందజేశారు. నేటికీ విద్య బోధిస్తున్న ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, లెక్చరర్ బాబు, పూర్వ అధ్యాపకులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, మాధురి, వెంకటేశులు, కోదండరాముడు, రాధాకృష్ణ, రామాంజినేయులును సన్మానించారు. ఇందులో సుమారు 100 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఎప్పుడూ గైర్హాజరే..

- విధుల పట్ల కణేకల్లు ఈఓఆర్డీ నిర్లక్ష్యం
- ఇన్‌చార్జి ఎంపీడీఓగా నియమించి..

మరింత సహకరిస్తున్న జిల్లా అధికారులు


ఖాళీగా ఉన్న ఈఓఆర్డీ కుర్చీ

కణేకల్లు, సెప్టెంబరు14(ఆంధ్రజ్యోతి): మండల ఈఓఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న చంద్రమౌళి తరచూ విధులకు డుమ్మా కొడుతున్నా జిల్లా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఈ అధికారి అందుబాటులో ఉండకపోవడంతో మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వారంలో కేవలం రెండు, మూడురోజులు మాత్రమే చుట్టపుచూపుగా వచ్చి.. మిగతా రోజుల్లో జిల్లా కేంద్రంలో సమావేశం పేరుతో విధులకు రావడం లేదు. పలు కారణాలతో విధులకు డుమ్మా కొడుతున్నాడు. అంతేకాక పనుల కోసం ఫోన్ చేస్తే కనీసం రిసీవ్ కూడా చేయకపోవడంతో ఆయన తీరుపట్ల ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పంచాయతీలకు వచ్చే నిధులకు సంబంధించిన వివరాలు, ఇతరత్రా సమాచారాన్ని నెలల తరబడి సర్పంచులకు ఇవ్వడం లేదు. కొంతమంది సర్పంచులతో కుమ్మక్కై గ్రామ పంచాయతీల్లో పనులు చేయకుండానే నిధులు డ్రా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆరునెలల క్రితం వచ్చిన 15 ఫైనాన్స్ సమాచారాన్ని కూడా గుట్టుగా ఉంచారు. ఏ పంచాయతీలకు ఎంత నిధులు వచ్చాయి... ఏ పనులు చేశారన్న విషయం కూడా తెలియడం లేదు.ఆయన తీరు నచ్చక .. ఇక్కడ ఎంపీడీఓ సైతం సెలవులో వెళ్లిపోయాడు. దీంతో కారణాలను తెలుసుకొని.. సరిచేయాల్సిన జిల్లా అధికారులు ఈఓఆర్డీకే ఇన్‌చార్జ్ ఎంపీడీఓగా బాధ్యతలు అప్పగించి.. ఆయనకు మరింత సహకరించారు. దీంతో ఇక ఆయన ఆడిందే ఆటగా పాడిందే పాటగా సాగుతోంది. ఈఓఆర్డీ, ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న చంద్రమౌళి.. నిత్యం విధులకు గైర్హాజర్ అవుతుండటంతో.. కిందిస్థాయి సిబ్బందీ.. విధులను నిర్లక్ష్యం చేస్తోంది. పర్యవేక్షణ లేకపోవడంతో ఆయా గ్రామాల్లో కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా హాజరు కావడం లేదు. ఆయన వ్యవహార శైలిపై రాజకీయ నాయకులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి.. విధులను నిర్లక్ష్యం చేసే వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

క్రైం న్యూస్..

హోటల్‌లోకి దూసుకెళ్లిన కారు



కూడేరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): స్థానిక అనంత వెంకటరెడ్డి కాలనీ సమీపంలోని హోటల్‌లోకి కారు అదుపు తప్పి.. దూసుకెళ్లింది. ఆదివారం అనంతపురం నుంచి ఉరవకొండకు వెళ్తున్న ఈ కారు కూడేరు సమీపంలోకి రాగానే అదుపు తప్పి.. నారాయణస్వామికి చెందిన హోటల్‌లోకి దూసుకెళ్లింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. కారులోని వారికీ ఎలాంటి గాయాలూ కాలేదు.

రెండు గొర్రెల మృతి

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని హరేసముద్రం గ్రామ సమీపంలో విద్యుదాఘాతానికి రెండు గొర్రెలు ఆదివారం మరణించాయి. ఎళంజి తిప్పయ్య 150 గొర్రెలు పెంచుకుంటున్నాడు. ఆదివారం మేత కోసం గొర్రెలు తోలుకోని వెళ్ల గా.. గ్రామ సమీపంలోని పొలంలో విద్యుత్ స్తంభానికి ఉన్న స్టే వైరుకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో.. దాన్ని తాకిని రెండు గొర్రెలు అక్కడికక్కడే మరణించాయి. దాదాపు రూ. 36 వేలు నష్టం జరిగినట్లు బాధితుడు వాపోయారు. ఎవరైన మనుషులు ఆ వైరు ను తాకి ఉంటే పెను ప్రమాదం జరిగి ఉండేదని, అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని, అలాగే బాధితుడికి పరిహారం ఇవ్వాలని మాజీసర్పంచ్, టీడీపీ నాయకుడు పల్లి తిప్పేస్వామి కోరారు.

కమలపాడులో మూడు చోట్ల చోరీ

ఒకే రోజు రెండు ఇళ్లు, దేవాలయంలో దొంగతనం

వజ్రకరూరు(ఉరవకొండ), సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండల కమలపాడులో ఆదివారం ఒకే రోజు మూడు చోట్ల చోరీ జరిగింది. రెండు ఇళ్లు, దేవాలయంలో దుండగులు చోరీకి పాల్పడి వెండి, నగదును ఎత్తుకెళ్లారు. మాజీ ఎంపీపీ శైలజరెడ్డి ఊరికి వెళ్లగా.. దుండగులు శనివారం రాత్రి ఇంట్లోకి చొరబడి ఐదు బీరువాలను పగలగొట్టి ఇంట్లోని ఐదు కేజీల వెండి, రెండ జతల బంగారు కమ్మలు, రూ.10వేలు నగదు ఎత్తుకెళ్లారు. ఆదివారం ఇంటికి వచ్చిన ఆయన చోరీ గురించిన విషయాన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. అదే గ్రామంలో దేవేంద్రస్వామి అనే అర్చకుడు ఇంటికి తాళాలు వేసి.. కసాపురానికి శనివారం వెళ్లాడు. అతని ఇంట్లో కూడా చొరబడిన దుండగులు.. రూ.1.50లక్షల నగదు, వెండి వస్తువులను ఎత్తు కెళ్లారు.అలాగే గ్రామంలోని శివాలయంలో హుండీ పగులగొట్టి అందులోని నగదు ఎత్తుకెళ్లారు. ఎస్ఐ నాగస్వామి సంఘటన స్థలాలను పరిశీలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

విజృంభిస్తున్న డెంగీ


యాడికి ప్రభుత్వ ఆసుపత్రిలో జ్వరపీడితులు

యాడికి, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో డెంగీ జ్వరం విజృంభిస్తోంది. జ్వర పీడితులతో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యశాలలు కిటకిటలాడుతున్నాయి. అపరిశుభ్ర వాతావరణంతో దోమలు పెరిగిపోయి డెంగీ జ్వరాలు పెరిగిపోతున్నాయి. యాడికిలోని నాగులకట్టవీధికి చెందిన దీప్తి అనే బాలిక డెంగీ బారిన పడి తాడిపత్రిలోని ఒక ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందుతోంది. చిక్కేపల్లి గ్రామానికి చెందిన బాలుడు సంతోష్‌రెడ్డి డెంగీ సోకడంతో కర్నూలుకు తరలించారు. మండలంలోని ఏ గ్రామంలో చూసినా డెంగీ జ్వరం బారిన పడిన వారే కనిపిస్తున్నారు. యాడికి మండలం నుంచి జ్వర పీడితులు ఎక్కువగా చికిత్స కోసం అనంతపురం వెళ్తున్నారు. డెంగీ మరింత వ్యాపించకుండా ఆరోగ్యశాఖ అధికారులు తగు చర్యలు చేపట్టాలని, గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

● ప్రబలుతున్న విష జ్వరాలు

యల్లనూరు : మండలంలో విషజ్వరాలు అధికమవుతున్నాయి. స్థానిక బీసీకాలనీ, కోటవీధిలో జ్వరాలు అధికంగా కనిపిస్తున్నాయి. ఇంటిలో ఒకరికి సోకిన జ్వరం .. ఇంటిల్లిపాదికి వ్యాపిస్తోంది. రక్తపరీక్షల చేయించుకోవడానికి తాడిపత్రి, పులివెందుల ప్రాంతాలకు వెళుతున్నారు. అక్కడ ఆసుపత్రిలో మలేరియా, టైఫాయిడ్ లక్షణాలు చెబుతుండడంతో అక్కడే వైద్యం చేయించుకుంటున్నారు. జంగంపల్లి, కృష్ణాపురం, పాతపల్లి, వెన్నపూసపల్లి గ్రామాల్లో కూడా జ్వరాలు కనిపిస్తున్నాయి. వైద్యాధికారులు గ్రామాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని సర్పంచ్‌లు కోరుతున్నారు.

యాడికి కాలువకు సాగునీరు ఇవ్వాలి


కాలువను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

పెద్దవడుగూరు, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి): యాడికి కాలువకు సాగునీరు అందించాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని కదరగుట్టపల్లి గ్రామం వద్ద ఉన్న రెగ్యులేటర్‌ను పరిశీలించారు. సీపీఐ నాయకుడు సూర్యనారాయణరెడ్డి, మండల కార్యదర్శి వెంకటరాముడుయాదవ్ మాట్లాడుతూ.. యాడికి కాలువ తవ్వి 30సంవత్సరాలు అవుతున్నా.. సాగునీరు అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. ప్రస్తుతం వర్షాలు బాగా కురుస్తున్నాయని, పెద్దవడుగూరు, యాడికి గ్రామాల్లోని చెరువులను నీటితో నింపాలని కోరారు. వారి వెంట సీపీఐ నాయకులు హుస్సేన్‌పీరా, రంగనాయకులు,సుధాకర్‌గౌడ్, అల్లాబకాష్ ఉన్నారు.

శిథిలావస్థలో విద్యుత్ సబ్‌స్టేషన్ భవనం

బొమ్మనహాళ్, సెప్టెంబరు 14(ఆంధ్రజ్యోతి) స్థానిక గ్రామ సచివాలయం వద్ద ఉన్న సబ్‌స్టేషన్ భవనం శిథిలావస్థకు చేరింది. పెచ్చులూడి పడుతుండటంతో ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భవనం అసౌకర్యంగా ఉందని, విధులు నిర్వహించాలంటే ఇబ్బందిగా ఉందని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. భవనం వద్ద కంప చెట్లు భారీగా పెరిగాయని, వర్షం వస్తే భారీగా నీరు నిల్వ ఉంటోందని తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి నూతన భవనాన్ని నిర్మించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


విద్యుత్ సబ్‌స్టేషన్ భవనం దుస్థితి